ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 12 ఫిబ్రవరి 2025

పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల పీజీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు వర్సిటీలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆర్ట్స్ కోర్సుల పరీక్షలకు 339 మందికి గాను 21 మంది, సైన్స్ కోర్సుల పరీక్షలకు 409 మందికి గాను 14 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా, నాలుగేళ్ల సమీకృత విద్యా కోర్సు మొదటి, మూడు సెమిస్టర్ పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఈ నెల 25 వరకు కొనసాగుతాయి. ఆర్ట్స్ పరీక్షలకు వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, సైన్స్ పరీక్షలకు ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ ఎన్.లోకేశ్వరి చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరిస్తున్నారు.

గుట్టల్లో.. ఇళ్ల పట్టాలు!


ఎచ్చెర్ల మండలం కొంగరాం వద్ద గుట్టపై పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు

సొంతిల్లు ప్రతి ఒక్కరి కల. తాగునీరు, విద్యుత్ వంటి అన్ని సదుపాయాలు ఉన్న చోట్ల కట్టుకోవాలని భావిస్తుంటారు. గత వైసీపీ సర్కారు మాత్రం కొండలు, గుట్టలు ఉన్న చోట పేదలకు ఇళ్ల పట్టాలు అందించింది. తమ వాళ్లకు మాత్రం మంచి స్థలాలను కేటాయించింది. దీనివల్ల పేదలు గృహ యోగానికి నోచుకోలేకపోయారు. ఇచ్చిన స్థలాలు కూడా సెంటు, సెంటున్నరే కావడం.. అక్కడ తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకపోవడం కారణంగా చాలామంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. పట్టాల పంపిణీలో కూడా అక్రమాలు చోటుచేసుకున్నాయి. వైసీపీ మద్దతుదారులకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. కొన్నిచోట్ల ముందుగానే వైసీపీ బడానాయకులు తక్కువ ధరకు స్థలాలను కొనుగోలు చేసి వాటినే పేదల పట్టాల కోసం ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించారు. ఈ అక్రమాలపై కూటమి సర్కారు విచారణకు ఆదేశించింది.

- నివాసయోగ్యం కానిచోట పేదలకు కేటాయింపు
- వైసీపీ మద్దతుదారులకు మాత్రం మంచి స్థలాలు అందజేత
- జగన్ సర్కారు నిర్వాకం
- పట్టాల పంపిణీలో అక్రమాలు
- విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశం

శ్రీకాకుళం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 74,892 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. ఇందులో కేవలం 38,522 మంది మాత్రమే ఇళ్లను నిర్మించుకున్నారు. వీరిలో సొంత స్థలాల్లోనే గృహాలు కట్టుకున్న వారు అధికంగా ఉన్నారు. 15వేల గృహాలకు సంబంధించి పునాదుల కోసం గోతులు తవ్వి వదలిలేశారు. 5,638 ఇళ్లకు సంబంధించి పనులే ప్రారంభం కాలేదు. జగన్ సర్కారు అందించిన స్థలాలు అనుకూలంగా లేకపోవడంతో చాలామంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టలేదు. ఇళ్ల స్థలాలు తీసుకోకుంటే ఇతర పథకాలు వర్తిస్తాయా లేదో అని అప్పట్లో లబ్ధిదారులు గందరగోళానికి గురయ్యారు. అలాగే వైసీపీ నాయకులు ఇంటింటికీ వచ్చి తమ ప్రభుత్వ పథకాలు గురించి ప్రచారం చేయడం, వలంటీర్లు కూడా మాటిమాటికి సర్వేచేసి వివరాలు తీసుకోవడంతో అధికమంది అయిష్టంగానే ఇంటి పట్టాలను పొందారు.


పొన్నాడ వద్ద రాళ్లతో నిండిన జగనన్న లేఅవుట్

విచారణకు ఆదేశం..

వైసీపీ ప్రభుత్వంలో పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు సెంటు, గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు సెంటున్నర స్థలాన్ని మాత్రమే కేటాయించారు. పైగా ఈ స్థలం ఏకంగా రూ. 6లక్షల పైబడి విలువ చేస్తుందని ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పారు. కానీ, వాస్తవంగా సెంటు, సెంటున్నర స్థలంలో ఇళ్ల నిర్మాణం కష్టంగా ఉండేది. తమకు నచ్చినట్లు పేదలు ఇళ్లు కట్టుకోలేకపోయే వారు. హాలు, వంట గది, బాత్‌రూం అన్నీ అందులోనే నిర్మించడంతో ఇరుకుగా ఉండేవి. కుటుంబంతో అందులో జీవించడం కష్టంగా మారేది. ఇంటికి ఎవరైనా బంధువులు గానీ వస్తే వారు కూర్చోవడానికి కూడా జాగా ఉండేది కాదు. దీంతో చాలామంది

(మిగతా 6వ పేజీలో..)

వైసీపీ నేతల అనుచరులకే ప్రాధాన్యం..

జిల్లా కేంద్రం శ్రీకాకుళం నగరంలోని పేదలకు సంబంధించి ఎచ్చెర్ల మండలం పొన్నాడ, కొంగరాం గ్రామాల వద్ద.. అలాగే, శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస, రాగోలు వద్ద స్థలాలు కేటాయించారు. అయితే, స్థలాల కేటాయింపులో పలు అక్రమాలు జరిగాయి. వైసీపీ నాయకులకు, వారి అనుచరులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. మంచి స్థలాలను ఎంపిక చేసి వారి పట్టా నెంబర్లు, ప్లాట్ల నెంబర్లు ముందు వరుసలో ఉండేలా ప్రణాళికతో వ్యవహరించారు. సాధారణ లబ్ధిదారులకు మాత్రం చెరువు గట్టుకు అనుకుని, పెద్దపెద్ద గుట్టల వద్దనూ, కొండ ప్రాంతాలనూ ఆనుకుని స్థలాలను కేటాయించారు. పొన్నాడ వద్ద ఉన్న ప్లాట్ల నెంబర్ల క్రమ సంఖ్యకు, క్షేత్రస్థాయిలో కేటాయించిన ప్లాట్ల సంఖ్యకు మధ్య తేడాలు ఉన్నాయి. అలాగే పాత్రునివలస-1 వద్ద కేటాయించిన స్థలాల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇదిలాఉండగా, పేదలకు స్థలాలు ఎక్కడ కేటాయిస్తారో వైసీపీ పార్టీ నాయకులకు ముందుగానే తెలియడంతో భూసేకరణలో పెద్ద తతాంగం నడిపారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాస, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో ముందుగానే తక్కువ ధరకు భూమిని కొనుగోలు చేశారు. ఆభూముల్లోనే పేదలకు పట్టాలు ఇచ్చేందుకుగాను వాటిని ఎక్కువ ధరకు అప్పటి ప్రభుత్వానికి విక్రయించారు. ఈ విషయం పైకి తెలియకుండా జాగ్రత్తగా వ్యవహరించారు. బడానాయకులు సైతం ఇందులో ఉండటంతో ఆ ప్రక్రియ సజావుగా సాగిపోయింది.

మృగాళ్లు..

- రెండుచోట్ల ఇద్దరు బాలికలపై అత్యాచారం
- నిందితులపై పోక్సో కేసు నమోదు
- మరోచోట ఘటనలో నిందితుడి అరెస్టు

జిల్లాలో ముగ్గురు మగాళ్లు మృగాలుగా మారారు. సారవకోట మండలంలో ఓ వ్యక్తి పదేళ్ల బాలికపై అత్యాచారం చేయగా, పలాస పట్టణంలో మరొక వ్యక్తి 16 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పలాస మండలంలో ఇంకొక వ్యక్తి ఓ దివ్యాంగురాలిపై దారుణానికి ఒడిగట్టాడు. ఈ మూడు ఘటనలపై కేసులు నమోదుకాగా, ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి..



తినుబండారాలు ఇచ్చి..

జలుమూరు (సారవకోట) ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సారవకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన పి.ముకుందరావు అలియాస్ రామారావు అనే వ్యక్తి సోమవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు.. బాలిక సోమవారం సాయంత్రం పిల్లలతో కలిసి వీధిలో ఆడుకుంటుండగా ముకుందరావు ఆమెను తన ఇంటికి పిలిచాడు. తినుబండారాలు ఇచ్చి లోపలకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక ఏడ్చుకొని తన ఇంటికి వెళ్లి తల్లికి విషయం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేయగా, డీఎస్పీ ప్రసాదరావు దర్యాప్తు చేస్తున్నారు.

నెల రోజులుగా..

పలాస, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పలాస పట్టణంలోని ఓ వీధిలో నివాసం ఉంటున్న 16 ఏళ్ల బాలికపై అదే వీధికి చెందిన బి.శివ అనే వ్యక్తి నెలరోజులుగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు శివపై మంగళవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. నిందితున్ని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి..

పలాస మండలంలోని ఓ గ్రామానికి చెందిన దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన వరిశ భాస్కరరావు కొద్ది నెలలుగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి లోబర్చుకున్నాడు. దీంతో ఆమె గర్భం దాల్చింది. వివాహానికి భాస్కరరావు అంగీకరించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు రెండు రోజుల కిందట పలాస పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి పలాస మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. భాస్కరరావును పాతపట్నం సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు.

ఆన్‌లైన్‌లో రైల్వే పాసులు

- స్టేషన్ల చుట్టూ తిరగనవసరం లేదు
- దివ్యాంగుల కోసం రైల్వేశాఖ నిర్ణయం



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల రైల్వే పాసులకు సంబంధించి రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్‌లోనే వారు పాసులు పొందేందుకు అవకాశం ఇచ్చింది. గతంలో మాదిరిగా రైల్వేస్టేషన్ల చుట్టూ తిరగకుండానే ఇంటి వద్ద నుంచే రైల్వే పాసులు పొందే వెసులుబాటు కల్పించింది. ఇంటర్ నెట్ కేంద్రాల్లో కానీ.. మీ సేవా కేంద్రాలకు వెళ్లి కానీ దరఖాస్తు చేసుకోవచ్చు. హెచ్‌టీటీపీ: దివ్యాంగజనిధి.ఇండియన్ రైల్వే.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులోనే యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డు (యూడీఐడీ) మంజూరు చేస్తారు. కొత్త పాసులు కావాల్సిన వారు, పాతవి రెన్యూవల్ చేయాలనుకునేవారు ఇందులో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే ఈ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. దివ్యాంగులు ఓటీపీ ఆధారంగా ఆన్‌లైన్‌లోనే పాసు ఐడీ కార్డు తీసుకోవచ్చు. కొత్తగా దరఖాస్తు చేసుకునే సమయంలో తొలుత తన పేరు, ఆధార్ కార్డు నెంబర్, ఫోన్ నెంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయిన తరువాత ఫోన్ నెంబర్ ఎంటర్ చేయాలి. తరువాత వచ్చిన ఓటీపీ నెంబర్‌ను ఎంటర్ చేసి లాగిన్ కావాలి. ఎన్నిసార్లు లాగిన్ అయినా పేర్లు రిజిస్టర్ చేసుకునే వెసులుబాటు కల్పించారు.

కొందరే ఉపయోగించుకుంటున్నారు..

జిల్లాలో 7వేల మంది దివ్యాంగులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఇందులో కొద్ది మంది మాత్రమే రైల్వేపాసులు ఉపయోగించుకుంటున్నారు. ఎక్కువ మంది పాసులు తీసుకోవడం లేదు. జిల్లాలో పెద్దవైన శ్రీకాకుళం రోడ్, నౌపడ ఆర్ఎస్, పలాస, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లలోనే దివ్యాంగులకు పాసులు జారీ చేసేవారు. మిగతా స్టేషన్లు చిన్నవి కావడం, సిబ్బంది తక్కువగా ఉండడంతో పాసులు ఇచ్చేవారు కాదు. అయితే దివ్యాంగులు ఏటా రైల్వేపాసుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లడం కష్టతరంగా ఉండేది. పైగా కొన్నిస్టేషన్లలో ప్లాట్‌ఫారాలు దాటుకొని వెళ్లడం ఇబ్బందిగా ఉండేది. అందుకే రైల్వేశాఖ దివ్యాంగుల కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని దివ్యాంగులు ఆహ్వానిస్తున్నారు.

శుభ పరిణామం



ఆన్‌లైన్‌లో రైల్వే పాసులు అందిస్తుండడం శుభపరిణామం. గతంలో వ్యయప్రయాసలకు గురయ్యేవాళ్లం. సుదూర ప్రాంతాలు వెళ్లి పాసులు తీసుకోవడానికి చాలామంది విముఖత చూపేవారు. రైల్వేశాఖ స్పందించి ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో పాసులు పొందే వెసులుబాటు కల్పించడం బాగుంది. రైల్వేశాఖకు కృతజ్ఞతలు.

-తులసీరావు, దివ్యాంగుడు, ఇచ్ఛాపురం

మంచి నిర్ణయం



రైల్వేశాఖ మంచి నిర్ణయం తీసుకుంది. గతంలో పెద్దస్టేషన్లలో పాసుకు సంబంధించి కౌంటర్లు ఏర్పాటు చేసేవారు. అప్పట్లో రకరకాల సాంకేతిక సమస్యలు వచ్చేవి. దీంతో పాసులు పొందేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. ఆన్‌లైన్‌లో పాసుల జారీ ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం బాగుంది.

-ఎండ హిమతేజ, దివ్యాంగుడు, ఇచ్ఛాపురం


జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటారు

గుజరాతీపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభకనబరిచారు. గత నెల 22 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు జరిగాయి. జిల్లాలో 3,300 మంది విద్యార్థులు రాశారు. శ్రీకాకుళం నగరానికి చెందిన పెద్దింటి సాయిరుక్మిణి 99.664 పర్సంటైల్‌తో టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా నగరానికి చెందిన బొడ్డు సాయియశ్వంత్ 99.340, సంధుల ధీరజ్ 99.280, పైల రాహుల్ 98.312, సనపల రాజా రాఘవేంద్ర 98.284 పర్సంటైల్‌తో సత్తాచాటారు. వీరంతా నగరంలోని ఓ ప్రైవేట్ ఐటీ క్యాంపస్‌లో చదువుతున్నారు. ఏప్రిల్‌లో జరగనున్న సెషన్-2 పరీక్షకు వీరంతా సన్నద్ధమవుతున్నారు.

(మరిన్ని వివరాలు 7లో)

నామినేషన్లన్నీ ఓకే

- ముగిసిన నామినేషన్ల పరిశీలన
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు


నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు

మహారాణిపేట(విశాఖపట్నం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు అధికారుల ఆమోదం పొందాయి. కలెక్టరేట్‌లో మంగళవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ అనంతరం అభ్యర్థులందరి నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని ఎన్నికల అధికారి, కలెక్టర్ హరేంధిరప్రసాద్ ప్రకటించారు. ఎన్నికల పరిశీలకుడు ముదావత్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉదయం నామినేషన్ల పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. ఈ స్థానానికి మొత్తం పది మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు సమర్పించగా, వాటిలో నాలుగు సెట్లు తిరస్కరించామని, మిగిలినవన్నీ ప్రమాణాలకు అనుగుణంగా ఉండడంతో అన్నింటినీ ఆమోదిస్తున్నామని ప్రకటించారు. కాగా ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థులందరితో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇదిలా ఉండగా తుది జాబితా మేరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో డీఆర్వో సీతారామారావు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

75 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

- హాజరుకానున్న 40,346 మంది విద్యార్థులు
- ఆర్ఐవో దుర్గారావు

7లో

జిల్లాకు రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులు

7లో

సరిగమలు @ చిలకపాలెం

- హార్మోనియంల తయారీ ఇక్కడే..
- జర్మనీ రీడ్స్‌కు గిరాకీ
- వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచే సరఫరా

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సంగీత వాయిద్య పరికరాల్లో హార్మోనియంకు ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. ఈ హార్మోనియం తయారీకి చిలకపాలెం ప్రాశస్త్యం పొందింది. ఉభయ తెలుగు రాష్ట్రాలే కాకుండా ఒడిశా, పశ్చిమ బెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందినవారు సైతం చిలకపాలెం కేంద్రంగా హార్మోనియం తయారీ చేస్తున్న ఇద్దరు సోదరులను సంప్రదిస్తుండడం విశేషం. సుమారు మూడు దశాబ్దాలుగా హార్మోనియంలను తయారు చేస్తూ ఈ సోదరులు గుర్తింపు పొందారు. వారే రమణాచారి, అప్పలచారి.


హార్మోనియం తయారీలో రమణాచారి

ఆ ప్రత్యేకతే వేరు..

హార్మోనియం మీట నొక్కితే రాగాలు పలుకుతాయి. పద్య నాటకాలకు, భజన పాటలకు హార్మోనియం ఉంటేనే వినసొంపుగా ఉంటుంది. తొలుత జర్మనీ దేశీయులు హార్మోనియంను కనుగొన్నారు. వందేళ్ల నాటి జర్మన్లు వినియోగించిన హార్మోనియం రీడ్స్‌కు ఇప్పటికీ డిమాండ్ ఉంది. గాలి ద్వారానే హార్మోనియం పనిచేస్తుంది. సంగీతాభిమానులు తొలుత హార్మోనియం మీద ప్రాక్టీసు చేస్తుంటారు. పౌరాణిక పద్యాలు రక్తికట్టాలంటే హార్మోనియం ఉండాల్సిందే. కొన్నేళ్ల క్రితం వరకు గ్రామాల్లో పండగలకు, గ్రామదేవత ఉత్సవాలకు పౌరాణిక నాటకాల ప్రదర్శనలు తప్పనిసరిగా ఉండేవి. హరిశ్చంద్ర నాటకంలో కాటిసీనుకు ఇప్పటికీ ఆదరణ ఉంది. కాల క్రమేణా పౌరాణిక నాటకాలు చూసే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. కొన్నేళ్ల క్రితం ఏదైనా గ్రామంలో పౌరాణిక నాటకం ప్రదర్శిస్తున్నారని తెలిస్తే చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తిలకించేందుకు ఉత్సాహం చూపేవారు. క్రమేణా సినిమాలు, టీవీల మోజులో పడి ప్రజలు పౌరాణిక నాటకాలు చూసేందుకు ఆసక్తి చూపడం లేదు.

భజనలకు ఆదరణతో..

ఇటీవల కాలంలో భజనలకు ఎంతో ప్రాధాన్యం పెరిగింది. పౌరాణిక నాటకాలపై ఆదరణ తగ్గినప్పటికీ గ్రామాలు, పట్టణాల్లో ముఖ్య పర్వదినాలు, శుభ కార్యాల్లో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు కూడా భజనలపై ఆసక్తి చూపుతూ హార్మోనియంను వినియోగిస్తున్నారు. భజనలకు ఎక్కువగా హ్యాండ్ బాక్సులను వినియోగిస్తున్నారు. పౌరాణిక నాటకాలు తగ్గడంతో కాళ్లతో (లెగ్) వినియోగించే హార్మోనియంల వినియోగం బాగా తగ్గింది.

మూడు దశాబ్దాలుగా..

లావేరు మండలం బుడతవలసకు చెందిన నాదెళ్ల రమణాచారి, అప్పలచారి సోదరులు సుమారు మూడు దశాబ్దాలుగా చిలకపాలెం కేంద్రంగా హార్మోనియంలు తయారు చేస్తున్నారు. వారి కుటుంబ సభ్యులైన సన్యాసిరావు, గోవిందలు కూడా ఇదే పనిలోనే కొనసాగుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కూడా కొత్తగా హార్మోనియంల తయారీకి, పాడైన హార్మోనియంల మరమ్మతులకు ఇక్కడికి వస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి సంగీతాభిమానులు ఇక్కడికి వచ్చి వారికి ఇష్టమైన రీతుల్లో హార్మోనియంలు తయారు చేయించుకుంటున్నారు.

ఆసక్తితో నేర్చుకుని..

హార్మోనియంతో పద్యాలు పలికించడం నేర్చుకున్న నేదెళ్ల రమణాచారి ఆ తర్వాత ఇచ్ఛాపురంలోని దాసు బ్రదర్స్ వద్ద హార్మోనియం తయారీలో శిక్షణ పొందారు. సంగీతం పై ఉన్న ఆసక్తితోనే హార్మోనియం తయారీని నేర్చుకున్నట్టు రమణాచారి చెబుతున్నాడు. అయ్యప్ప, సాయి, శివ, సాయిబాబా, తదితర భజన పాటలకు హార్మోనియం లేకపోతే వినసొంపుగా ఉండవు. రామ మందిరాలు, చర్చిల్లో హార్మోనియంలు వినియోగించి పాటలు ఆలపిస్తారు. గంగిరెద్దు ఆడించేవాడు కూడా చేతి హార్మోనియంని వినియోగిస్తాడు. దక్షిణాది సన్నాయి మేళంలో కూడా చిన్న సైజు హార్మోనియంను వినియోగిస్తారు.

జర్మనీ రీడ్‌లకు అత్యంత గిరాకీ..

హార్మోనియం తయారీలో ప్రధానంగా రీడ్స్‌ను వినియోగిస్తారు. సుమారు 100 ఏళ్ల క్రితం జర్మనీలో తయారైన రీడ్స్‌ను ఇప్పటికీ వినియోగిస్తున్నారు. జర్మనీ రీడ్స్ పెద్దగా శబ్దం రావడంతో పాటు, రాగాలు కూడా బాగా పలికించగలవని చెబుతున్నారు. ఒక్కో హార్మోనియంలో మూడు వరుసలు ఉంటాయి. ఒక్కో వరుసలో 44 వంతున రీడ్స్‌ను అమరుస్తారు. ఆనాటి జర్మనీ రీడ్స్ చెన్నై, కోల్‌కత్తా, ముంబై, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో లభ్యమవుతున్నాయి. జర్మనీ రీడ్స్‌తో హార్మోనియం తయారీకి సుమారు రూ.50 వేలు ఖర్చు అవుతుంది. ఇండియాలో తయారైన రీడ్స్‌తో హార్మోనియం 25 నుంచి 30 వేల రూపాయలకే లభిస్తోంది.

కలప ఏదంటే..

హార్మోనియం తయారీ కోసం టేకు, గుమ్మడి, దేవదారు కలపను వినియోగిస్తారు. లెదర్, రాడ్స్ బ్రాస్‌తో తయారీ చేసే రీడ్స్‌ను శ్రుతి పలికించేందుకు వినియోగిస్తారు. హార్మోనియం తయారీకి అవసరమైన వాటిని చెన్నై, ముంబాయి, ఢిల్లీ, కోల్‌కత్తా ప్రాంతాల నుంచి తెప్పిస్తారు. హ్యాండ్ బాక్స్ తయారీకి వారం రోజుల సమయం పడుతుంది. లెగ్ హార్మోనియంను ఇద్దరు వ్యక్తులు 20 రోజులు కష్టపడితేనే తయారు చేయగలరు.

వివిధ రూపాలు...

భజన పాటలకు సింగిల్ హార్మోనియం పెట్టెను వినియోగిస్తారు. డబుల్ పెట్టె హార్మోనియంతో సంగీతం నేర్చుకుంటారు. లెగ్ హార్మోనియంలు బుర్రకథలు, పౌరాణిక నాటకాలకు వినియోగిస్తారు. హ్యాండ్ బాక్సుల తయారీకి రూ. 15 వేలు నుంచి రూ. 30 వేలు, లెగ్ హార్మోనియంలు డబుల్ అయితే రూ. 60 వేలు, త్రిబుల్ అయితే రూ.ఒక లక్ష అవుతుంది. అదే జర్మనీ రీడ్స్‌తో తయారైన హార్మోనియంల ధర కాస్త ఎక్కువగా పలుకుతుంది.


హార్మోనియం పెట్టెలు

డిమాండ్ బాగానే ఉంది..

నాకు సంగీతం అంటే ఆసక్తి ఎక్కువ. ఆ ఆసక్తితోనే హార్మోనియంతో పద్యాలు పలికించడం నేర్చుకున్నాను. ఆ తర్వాత ఇచ్ఛాపురంలో హార్మోనియం తయారీలో శిక్షణ పొందాను. ఉభయ తెలుగు రాష్ట్రాల నలు మూలల నుంచే కాకుండా, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కూడా కొత్తగా హార్మోనియంల తయారీకి, మరమ్మతుల కోసం ఇక్కడికి వస్తుంటారు. ముందుగా ఇచ్చిన ఆర్డర్లపైనే హార్మోనియం తయారు చేస్తున్నాం. హార్మోనియంకు డిమాండ్ బాగానే ఉంది.

-నాదెళ్ల రమణాచారి, హార్మోనియం తయారీదారు, చిలకపాలెం

ఉత్తమ నాటికగా 'ఇంద్రప్రస్థం'

- ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

కవిటి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బొరివంక గ్రామంలోని కళింగసీమ కళాపీఠం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన బల్లెడ అనసూయమ్మ స్మారక తెలుగు రాష్ట్రాల ఆహ్వానిత నాటిక పోటీలు అలరించాయి. వీటిలో మానవ సంబంధాల గొప్పతనమే ప్రధాన ఇతివృత్తంగా కనిపించాయి. ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నానికి చెందిన తెలుగు కళాసమితి వారి 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?', తృతీయ ప్రదర్శనగా గుంటూరు కళాకారుల 'చిగురు మేఘం' నాటిక ఎంపికైంది. 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?'లో నటించిన పి.వి.వరప్రసాద్ ఉత్తమ నటుడిగా, డి.హేమ ఉత్తమ విలన్‌గా, ఉత్తమ ఆహార్యంగా ఎస్.రమణ ఎంపికయ్యారు. 'జనరల్ బోగీలు'లో నటించిన సురభి ప్రభా వతి ఉత్తమ నటిగా, పి.టి.మాధవ్ ఉత్తమ రచయితగా ఎంపిక య్యారు. 'ఇంద్రప్రస్థం'లో నటించిన ఎస్.రవీంద్రారెడ్డి ఉత్తమ సహాయ నటుడితో పాటు ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. అదే నాటికకు ఉత్తమ సంగీత దర్శకుడిగా పి.లీలామోహన్, ఉత్తమ రంగాలంకరణకు ఎం.బీమ్‌కుమార్‌లు బహుమతులు అందుకున్నారు. 'పక్కింటి మొగుడు' నాటికలో నటించిన యు.వి.శేషయ్య ఉత్తమ హాస్యనటుడిగా ఎంపికయ్యారు. శర్వాణీ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'కొత్త పరిమళం' నాటిక ఆకట్టుకుంది. ఈ నాటికలో బి.శోభన్, పి.చలపతి, ఎస్.సర్వేశ్వరరావు, చలం నటించారు. విజేతలకు షీల్డులు, నగదు బహుమతులను అందించారు. కళాపీఠం అధ్యక్షుడు బి.లక్ష్మణమూర్తి, విశ్రాంత డీఎస్పీ ఎస్.ప్రసాదరావు, స్థానిక నేతలు పి.నేతాజీ, పి.ప్రసాదరావు, పి.కృష్ణారావు, బి.చిన్నబాబు, ఎం.రామారావు, ఎస్వీరమణ, టి.వి.రమణలు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.


'ఇంద్రప్రస్థం' కళాకారులకు బహుమతి అందిస్తున్న అతిథులు

ఆదిత్యుని హుండీల ఆదాయం రూ.64.39లక్షలు

అరసవల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి హుండీలను మంగళవారం లెక్కించారు. మొత్తం 19 రోజులకు గాను రూ.64,39,016 ఆదాయం లభించింది. ఇందులో నోట్ల రూపంలో రూ.62,10,095, చిల్లర రూ.2,28,921 లభించాయి. బంగారం 17.4 గ్రాములు, వెండి 1 కేజీ 212 గ్రాములు, యూఎస్ డాలర్లు 30, ఖతార్, ఒమన్ కరెన్సీ కూడా ఉందని ఈవో భద్రాజీ తెలిపారు. అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పర్యవేక్షణలో శ్రీహరి సేవ, సత్యసాయి సేవా సమితి, శ్రీవారి సేవా సమితి వారు ఈ లెక్కింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారి ప్రసాదరావు పట్నాయక్, శ్రీకూర్మం దేవస్థానం ఈవో గురునాథం, ఆమదాలవలస దేవాలయాల ఈవో తమ్మినేని రవి, ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు తదితరులు పాల్గొన్నారు. ఇలా ఉండగా.. గత ఏడాది రథసప్తమి ఆదాయ వివరాలను విలేకరులకు వెల్లడించడానికి ఆలయ సిబ్బంది నిరాకరించడం గమనార్హం.


ఆదిత్యాలయంలో హుండీల లెక్కింపు దృశ్యం

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు హసీనా


షేక్ హసీనా

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రంలోని పానిపట్టులో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు ఆంధ్రా జట్టు తరుపున తోటపాలేనికి చెందిన షేక్ హసీనా ఎంపికైంది. ఆమె తండ్రి భవన నిర్మాణ కార్మికుడు. డిగ్రీ పూర్తి చేసిన హసీనా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షులు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలి నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, తవిటమ్మ, నారాయణరావు, ఎన్.రమేష్ తదితరులు అభినందించారు.

గుట్టల్లో ఇళ్ల పట్టాలు

(ఐదో పేజీ తరువాయి)

లబ్ధిదారులు సెంటు స్థలంలో ఇళ్లు నిర్మించేందుకు ముందుకు రాలేదు. వారికి ఇచ్చిన స్థలాలను ఖాళీగా విడిచి పెట్టేశారు. ఫలితంగా పేదల సొంతింటి కల నెరవేరలేదు. అయితే, కూటమి ప్రభు త్వం వచ్చాకా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామని ప్రకటించింది. అలాగే, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణాల పేరుతో జరిగిన అక్రమాలు, కేటాయించిన నిధులు, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి సుముఖత చూపించకపోవడం, పట్టాలు అందుకున్నవారిలో అనర్హులు ఉన్నారా? వంటి అంశాలపై విచారణ చేపట్టేందుకు సిద్ధమవుతుంది. ఈ మేరకు కలెక్టర్‌కు ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. దీంతో మండలాల వారీగా తహసీల్దార్ల ఆధ్వర్యంలో బృందాలుగా ఇళ్ల పట్టాలపై విచారణ జరగనుంది. దీనివల్ల వైసీపీ నాయకుల అక్రమాలు బయటపడే అవకాశముంది. లబ్ధిదారులకు గతంలో ఇచ్చిన స్థలాలను రద్దుచేసి మంచి స్థలాలు ఇచ్చేందుకు వీలుంటుంది.

గంజాయి తాగుతూ.. ఎమ్మెల్యేకి చిక్కి!

- యువకులను గుర్తించిన గొండు శంకర్
- అక్కడికక్కడే పోలీసులకు అప్పగింత

అరసవల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయం 10.30 గంటలు. ఎమ్మెల్యే గొండు శంకర్, స్థానిక టీడీపీ నేతలు కలసి పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ పరిశీలనకు వెళ్లారు. అక్కడి షాపింగ్ కాంప్లెక్స్ మొదటి అంతస్తును పరిశీలిస్తూ... అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి విస్తుపోయారు. పట్టపగలే గంజాయి తాగుతూ ఇద్దరు యువకులు ఎమ్మెల్యేకు కనిపించారు. దీంతో ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించి.. ఆ యువకులను ఎస్.ఐ. కామేశ్వరరావుకు అప్పగించారు. మత్తు పదార్థాల నివారణకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే శంకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ సమస్యలపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడులకు పూర్తి అవగాహన ఉందన్నారు. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్‌ను వ్యాపారులకు అనువుగా తయారు చేస్తామని చెప్పారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేసి ప్రజలకు, వ్యాపారులకు ఆమోదయోగ్యంగా తయారు చేస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నవీన్, రెడ్డి గిరిజా శంకర్, కవ్వాడి సుశీల, తదితరులు పాల్గొన్నారు.


యువకులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే శంకర్, పోలీసు అధికారులు

అపరాలకు మంచు ముప్పు

- మినుము, పెసర పంటలపై ప్రభావం
- ఆందోళనలో అన్నదాతలు


మంచు కారణంగా జమ్ము వద్ద పొలాల్లో రంగు మారిన మినప పంట

నరసన్నపేట/ హరిపురం/ పలాస రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరిపంట తరువాత జిల్లాలలో అత్యధిక విస్తీర్ణంలో పండించేది అప రాల పంటలైన పెసర, మినుము, ఉలవ. దీంతో పాటు వాణిజ్య పంటలైన నువ్వులు, కర్రపెండ లం, చెరుకు వంటివాటిని అధికంగా అన్నదాత లు సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు, కోతల సమయంలో భారీ వర్షాలు, తుఫాన్‌లతో వరి పంట తీవ్ర నష్టాలకు గురై ఇబ్బందులు పడుతున్న రైతులకు రబీ సాగులో వేస్తున్న అపరాలు ఆర్థికంగా ఎంతో కొంత ఆదుకునేవి. కానీ ప్రస్తుతం ఈ ఆశ అడియాస అవుతోంది. ఈ ఏడాది మంచు ప్రభావంతో చీడపీడలు ఆశించి... రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రసాయన ఎరువులను పిచికారీ చేసి... పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా పంట చేతికి అందుతుందనే భరోసా లేదు.


కొండలోగాం వద్ద తెగుళ్లు ఆశించిన కర్రపెండలం పంట

మంచుతో ఇక్కట్లు..

రబీలో వేసిన వేరుశెనగ, రాగులు, మినుము, పెసర వంటి పంటలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. మందస, పలాస, వజ్రపుకొత్తూరు, సోంపేట తదితర మండలాల పరిధిలో సుమా రు 12వేల ఎకరాల్లో పెసర, మినుము వంటి అరుతడి పంటలు సాగుచేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో సుమారు 3వేల ఎకరాల్లో ఉలవ సాగవుతోంది. మందస మండ లంలో జీఆర్‌పురం, డబారు, దేవుపురం, పిడిమందసతో పాటు మహేంద్రతనయ, సునాముది, కళింగదల్, డబార్సింగి, సంకుజోడి, గోపాల సాగరం పరిధిలో వీటిని సాగు చేస్తున్నారు. పలాస మండలంలో రెంటికోట, లక్ష్మీపురం, బ్రాహ్మణతర్లా, అల్లుకోల, గరుడుఖండి, వజ్రపుకొత్తూరు మండలంలో నగరంపల్లి, రిట్టపాడు, పూండి, బెండి తదితర గ్రామాల్లో మినుము, పెసర పంటలు అధికంగా సాగుచేస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో 20వేల ఎకరాల్లో పెసర, మినుము పంటలు వేశారు. సంక్రాంతి వరకూ ఆశాజనకంగా ఉన్న ఈ పంటలు ఇటీవల కురిసిన మంచు కారణంగా దెబ్బతిన్నాయి. ఆకులకు, పువ్వుదశలో ఉన్న పంటకు చీడపీడలు ఆశించి దెబ్బ తీస్తున్నాయి. పేను బంక పురుగు ఆశించడంతో ఆకులు రాలి.. కాండం మాత్రమే మిగులుతోంది. ఒకవైపు మంచు, పురుగు పోటుతో తీవ్రంగా నష్టపోతున్న రైతులకు అడవి పందుల రూపంలో మరో సమస్య ఎదురవుతోంది. కనీసం పెట్టుబడులైనా దక్కుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కౌలు రైతుకు కష్టమే..

కౌలుకు పొలాలు చేస్తున్న రైతులకు అప రాలు దెబ్బతీశాయి. ఎకరా పొలానికి ఏడాదికి రూ.19వేల వరకూ చెల్లించి.. సాగు చేస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడులు, ఎరువులు ఇతర ఖర్చులకు ధాన్యం డబ్బులు సరిపోగా... అపరా లైనా ఆదుకుంటాయని భావించారు. కానీ అంత గా దిగుబడులు రాకపోవడంలో రైతులు దిగాలు చెందుతున్నారు. గత ఏడాది క్వింటా పెసలు ధర రూ.9,500 ఉండగా... ప్రస్తుతం రూ.6,800 మాత్రమే ఉంది. మినుములు గత ఏడాది క్విం టా రూ.7,200 ఉండగా ఈ ఏడాది రూ.5,900 పలుకుతున్నాయి. దీంతో కౌలు రైతులకు వ్యవసాయం భారంగా మారింది.

రైతులను ఆదుకోవాలి..



ఏటా ఖరీఫ్ పంట రైతులకు నష్టాలను మిగుల్చుతుండగా... రబీ కాస్తా ఆదుకుంటోంది. ప్రకృతి వైపరీత్యాలు, మంచు ప్రభావంతో పంట నష్టపోయి... రైతులు తీవ్రంగా దెబ్బ తింటున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-అగ్గున్న జగన్నాయకులు, రైతు, హరిపురం

మందులు సరఫరా చేయాలి..



అపరాలు సాగుచేస్తున్న రైతుల వివరాలు ఇప్పటికే వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈకేవైసీ చేశారు. ప్రభుత్వం వెంటనే రసాయన లేదా సేంద్రియ మందులను ఉచితంగా సరఫరా చేసి ఆదుకోవాలి. లేకుంటే రైతు పరిస్థితి అధ్వాన్నంగా మారుతుంది.

-మార్పు మాధవరావు, బిన్నల

వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలి..



ఆరుతడి పంటలకు వచ్చే చీడపీడలను మా సిబ్బంది పరిశీలిస్తున్నారు. వచ్చే తెగుళ్లను బట్టి మందుల కోసం సూచనలు, సలహాలనిస్తున్నాం. రైతులకు ఇక్కట్లు లేకండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. బాధిత రైతులు మా కార్యాలయాన్ని సంప్రదిస్తే పరిశీలించి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తాం.

-ఎల్.మధు, ఏడీ, పలాస

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి..



ప్రభుత్వం గత ఏడాది అపరాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఆ ఊసేలేదు. ప్రైవేటు వ్యాపారులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారుల దోపిడీ నుంచి ప్రభుత్వం కాపాడాలి.

-యాళ్ల వేణుగోపాలరావు, మాకివలస

మద్దతు ధరకే కొనుగోలు చేయాలి..



అపరాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చూడాలి. పప్పుల ధరలు కిలో రూ.150 వరకు ఉంటే... మినుములు, పెసల ధరలు మాత్రం కిలో రూ.60 నుంచి రూ.70 మాత్రమే ఉంటున్నాయి.

-బైరి తవిటయ్య, తామరాపల్లి

పది రోజుల్లో కాలువలు శుభ్రం చేస్తాం

●ఎచ్చెర్ల పంచాయతీ కార్యదర్శి బోర రమణయ్య

ఎచ్చెర్ల,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి):పంచాయతీ పాలకవర్గం అనుమతి పొందిన వెంటనే పదిరోజుల్లోగా కాలువలన్నీ శుభ్రం చేస్తామని ఎచ్చెర్ల పంచాయతీ కార్యదర్శి బోర రమణయ్య తెలిపారు. మంగళవారం 'ఎచ్చెర్ల.. కంపు కంపు!' శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితంకావడంతో అధికారులు స్పందించి కాలువల్లో పూడిక..వీధుల్లో చెత్త తొలగింపుపనులు చేపట్టారు. వెటర్నరీ ఆసుపత్రి, మెండవీధిలో కాలువను శుభ్రం చేశారు. మెండ వీధిలో కాలువలో పేరుకుపోయిన చెత్త తొలగించారు. కాగా గ్రామంలోని వీధులన్నీ శుభ్రం చేసేందుకు, కాలువల్లో పూడికలు తొలగించేందుకు అంచనాలు రూపొందించామని కార్యదర్శి రమణయ్య తెలిపారు.

హిట్ అండ రన్ బాధితులకు పరిహారం

●జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు


గుజరాతీపేట: మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గుజరాతీపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు తక్షణమే నష్ట పరిహారం అందించాలని స్కీమ్ కన్వీనర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు చెప్పారు.మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా హిట్అండ్ రన్ బాధితులకు త్వరగా నష్ట పరిహారం అందించే విధానాలపై చర్చించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, డీఎస్పీ డి. ప్రసాద్, ఆర్డీవో కార్యాలయ ఏవో ఈశ్వరమ్మ, రాజాం ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

శ్రీకాకుళం రూరల్,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని కిష్టప్పపేటలో దివ్యాంగులను గుర్తించేందుకు మంగళవారం వైద్యఆరోగ్యశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆ సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్మౌలానా సూచనల మేరకు సంస్థకార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా వైద్యాధికారి టీవీ మురళీకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణ్బాబులు గ్రామంలో దివ్యాంగులనుగుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో సిమ్మ సాత్విక్, చల్ల హరి పాల్గొన్నారు.

బలివాడలో పారిశుధ్య పనులు


పూడికలను తొలగిస్తున్న కార్మికులు

శ్రీకాకుళం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలివాడలో ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు సర్పంచ్ వెంకట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మూడున్నర కిలో మీటర్ల మేర మురుగు కాలువల్లో పూడికతీత పనులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ హయాంలో గ్రామంలో అభివృద్ధి పనులు జరగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి గ్రామ సమస్యలను తీసుకువెళ్లినట్లు తెలిపారు. జంగిల్ క్లియరెన్స్, రోడ్డు మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చెప్పారు. ఐదు రోజులుగా సచివాలయ కార్యదర్శి ఎస్.పి.సమత నేతృత్వంలో పరిసరాల శుభ్రత కార్యక్రమం చేపట్టామని సర్పంచ్ వివరించారు.

పండిట్ దీన్దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

గుజరాతీపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి పురస్కరించుకుని పార్టీ నాయకులు దీన్దయాళ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అట్టాడ రవిబాబ్జీ, చల్లా వెంకటేశ్వరరావు, నాయకులు బిర్లంగిఉమామహేశ్వరరావు, సీహెచ్ దుర్గారావు గాంధీ, గొలివి కరుణాకరరావు, బైపల్లి రాజేశ్వరి పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో ఘంటసాలకు...

శ్రీకాకుళం కల్చరల్ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్లో గల మధురగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి పురస్కరించుకుని గాయకుడు కేఎల్ఎన్మూర్తి ఆధ్వర్యంలో ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు ఘంటసాల పాడిన పాటలు ఆలపించారు. అనంతరం శ్రీకాకుళం సెంట్రల్ లైన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ మాట్లాడుతూ ఈనెల 14న మారుతి థియేటర్లో ఘంటసాల ది గ్రేట్ చిత్ర విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

హత్య జరిగిన స్థలంలో క్లూస్టీం పరిశీలన

సోంపేట, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): జింకిభద్రలో సోమవారం రాత్రి ఓ వృద్ధుడు మద్యం మత్తులో భార్యను హత్యచేసిన విషయం విదితమే. ఈ మేరకు హత్య జరిగిన స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు సోంపేట సీఐ బి. మంగరాజు, ఎస్ఐ వి.లవరాజుతో కలిసి మంగళవారం పరిశీలించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంఘటనపై క్లూస్టీం సభ్యులు పరిసరాలు పరిశీలించి వివరాలుసేకరించారు.

ఫాగింగ్ చేసి.. పారిశుధ్య పనులు నిర్వహించి

●శ్రీకాకుళం నగరపాలక సంస్థ 31వ డివిజన్లో పనుల ప్రారంభం ●అక్షరం అండగా-పరిష్కారమే అజెండాగా కార్యక్రమానికి స్పందన


ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం నగరపాలకసంస్థలోని 31వ డివిజన్ పరిధిలో తొలి విడతగా పారిశుధ్యపనులు ప్రారంభమయ్యాయి. దోమల నివారణకు ఫాగింగ్ కూడా చేపట్టారు. ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అక్షరంఅండగా..పరిష్కారం అజెండాగా కార్యక్రమం నిర్వహించిన విషయం విదితమే. రథసప్తమి వేడుకల్లో అధికారులు నిమగ్నంకాడంతో నగరంలో పారిశుధ్య తదితర పనులపై దృష్టిసారించలేకపోయారు.తాజాగా 31వ డివిజన్పరిధిలో మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ అధికారిసుధీర్ ఆధ్వర్యంలో సిబ్బంది పనులు చేపట్టారు. తొలుత నందలవీధి వద్ద మురుగునీటి కాలువలను శుభ్రం చేయించారు. దోమలు బెడద తీవ్రంగా ఉందని స్థానికులు అప్పట్లో సమస్యవిన్నవించుకోవడంతో ఫాగింగ్కాలువల్లో కెమికల్ స్ప్రేచేయించారు. బుధవారం నుంచి డివిజన్ పరిధిలో పట్నాయక్ కాలనీ, దండివీధి, సాయినగర్ కాలనీలో పారిశుధ్య పనులు జరుగుతాయని అధికారులు తెలిపారు.అలాగే ఇప్పటికే గుర్తించిన మేజర్ సమస్యలపై ప్రతిపాదన సిద్ధమైంది. మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ అధికారితో టీడీపీ నాయకులు విభూది సూరిబాబు, స్థానికులు ఏయే ప్రాంతాల్లో పనులు చేపట్టాల్సిఉందో వివరించారు.


కాలువలో మురుగునీటిని మళ్లిస్తున్న పారిశుధ్య సిబ్బంది

వ్యవసాయ సేవలు ఇక సులభతరం

● రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేసి, సేవలను మరింత సులభతరం చేసే సంకల్పంతో ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఆధార్ కార్డు తరహాలో అందించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సొంత భూమి గల ప్రతిరైతుతోనూ రిజిస్ట్రేషన్ చేయించాలని పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయంలో జేసీ ఫర్మాన్అహ్మద్ ఖాన్తో కలిసి జిల్లాలోని పలుశాఖల జిల్లా అధికారులతో గ్రామ సచివాలయాల పనితీరు, పల్లె పండుగ, ఉపాధిహామీ పథకం, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన, పారిశుధ్యనిర్వహణ, స్వర్ణ పంచాయతీ, సీజనల్ వ్యాధులు, ధాన్యం సేకరణ, రెవెన్యూ సర్వేలు, రీసర్వే ఫిర్యాదులు, లోకాయుక్త కేసులు, గ్రీవెన్స్ఫిర్యాదులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసచివాలయాల్లో బయోమెట్రిక్ విధానాన్ని సమర్థవంతంగా అమలుచేయాలని, సేవల నాణ్యతను మెరుగుపరచాలనికోరారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, స్వర్ణ పంచాయితీ లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలు రూపొందించాలని, ధాన్యం సేకరణ పర్యవేక్షించాలని, రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని, లోకాయుక్త కేసులను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీవో భారతిసౌజన్య, డీఆర్డీఏ పీడీ కిరణ్కుమార్, పరిశ్రమల శాఖ జీఎం ఉమామహేశ్వరరావు, కోరాడ త్రినాథస్వామి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టులు, వక్తిత్వ హననం వంటి నేరాల వల్ల కలిగే శారీరక, మానసిక ఇబ్బందులను నివారించడానికి అప్రమత్తతే ఏకైక మార్గమని తెలిపారు. జిల్లా ఎన్ఐసీ అధికారి కిరణ్కుమార్ సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమాచార ఎన్ఐసీ విజయ్ బాలు, ఇంజనీర్ శ్రీరామ్ ప్రకాష్, ఈ-ఆఫీసు టెక్నికల్ అసోసియేట్ కిషోర్కుమార్ పాల్గొన్నారు.

15న పాఠశాల సముదాయ సమావేశాలు

కవిటి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): పాఠశాలల సముదాయాల సమావేశాన్ని ఈనెల 15న నిర్వహించాలని ఎంఈవో ధనుంజయ మజ్జి కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం విద్యాశాఖ కమిషనర్తో జరిగిన టెలీకాన్ఫరెన్స్లో తెలియజేశారని ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు మండలంలోని పాఠశాలల సముదాయాలు శనివారం రెండోపూటలో ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు వీడియోకాన్ఫరెన్స్లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేం దుకు సూచనలు ఇవ్వనున్నారని తెలిపారు.

కేంద్ర బడ్జెట్పై సదస్సు

అరసవల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర బడ్జెట్పై సదస్సు జరిగింది. ఈసందర్భంగా అంబేద్కర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సంతోష్ రంగనాథ్, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్ కేంద్ర బడ్జెట్లో రాయితీలు, ప్రభుత్వ రంగాన్ని విస్మరించడంపై వివరించారు. ట్ ఉందన్నారు. ప్రభుత్వ రంగాన్ని విస్మరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, పి.సుధాకర్, సహాయ కార్యదర్శి కొరారి రామకృష్ణ, మెడికల్ రిప్స్ నాయకుడు సతీష్, తేజేశ్వరరావు, గణపతి, అట్టాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

దళ్లవలస వీఆర్వో సస్పెన్షన్

పొందూరు,ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దళ్లవలస గ్రామ సచివాలయంలో వీఆర్వో జె.తవి టయ్యు (తవుడు)ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వీఆర్వోపై వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదు మేరకు తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు విచారణ జరిపారు. ఈ మేరకు మూడురోజుల కిందటక్రమశిక్షణ చర్యలు కింద ఆర్డీవో కార్యాలయానికి సరెండర్ చేశారు. నివేదిక ప్రకారం ఆరోపణలు నిరూపణ కావడంతో వీఆర్వోను సస్పెండ్ చూస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

బూర్జలో అగ్నిప్రమాదం

బూర్జ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బూర్జలో జరిగిన అగ్ని ప్రమాదంలో సింహాద్రి శ్రీనివాసరావు ఫర్నీచర్ షెడ్ కాలిబూడిదైంది. ఈ మేరకు లక్ష రూపాయలకుపైగా ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సనారీ విశ్వేశ్వర విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కటకం రాజేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రూ.ఐదు కోట్ల సీఎస్ఆర్ నిధుల మంజూరు


సీఎస్ఆర్ నిధులకు సంబంధించి మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పలు అభివృద్ధి పనులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులు మంజూరయ్యాయి.ఈమేరకు నిధులు మంజూ రుచేసేందుకు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమష్టి కృషి ఫలితంగా ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు అంగీకరించారు. సోమవారం ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, యూఎన్డీఎస్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, అధికారులు అచ్చెన్నాయుడుతో విజయవాడలో భేటీ అయ్యారు. ఈ నిధులను యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంట్ అథారిటీ కింద పలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నారు.సీఎస్ఆర్ కింద ఇటీవల రామ్మోహన్నాయుడు చొరవతో రూ.50లక్షలు విలువచేసే కృత్రిమ పరికరాలను దివ్యాంగులకు అందించే కార్యక్రమానికి ఏఏఐ ముందుకు వచ్చిన విషయం విదితమే. ఇదే క్రమంలో సీఎస్ఆర్ ఫండ్ను మరింతగా ఈ ప్రాంత ప్రజలకు వినియోగపడేలా కేంద్ర, రాష్ట్ర మంత్రులు చొరవ చూపారు.ఈమేరకు సీఎస్ఆర్ కింద శ్రీకాకుళం జిల్లాకు, కుప్పం నియోజకవర్గానికి రూ.ఐదు కోట్లు చొప్పున మంజూరుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ నిధులతో నీటివనరులు, సామాజిక అభివృద్ధి పనులు, వైద్య సదుపాయాల సౌకర్యం, మానవ వనరుల అభివృద్ధికి సంబం ధించిన పనులకు వెచ్చించనున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

● పీయూసీ చైర్మన్ కూన రవికుమార్


మాట్లాడుతున్న రవికుమార్

పొందూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. పొందూరు వెలుగు కార్యాలయంలో డీఆర్డీఏ, సెర్ప్, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ పాలన, నాయకత్వంపై ఈసీలు, సీసీలు, సీఎఫ్లు, వీవోలకు శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘాలుగా బలోపేతమైతే వ్యక్తులుగా బలోపేతం కాగలరని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు అరుణ ,ఏపీఎం రమణమూర్తి, సీసీ జి. శ్యామలరావు పాల్గొన్నారు.

అలరించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?'

శ్రీకాకుళం కల్చరల్ ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్లో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా ముత్యాలమ్మ నాటక కళా పరిషత్ అధ్యక్షురాలు కేసీరెడ్డి రాజేశ్వరి ఆధ్వర్యంలో పీకేఎంటర్టైన్మెంట్ సహకారంతో మంగళవారం ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన తెలుగు కళాసమితి దర్శకులు చలసాని కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక అలరించింది. ఉత్తరాంధ్రకు చెందిన సౌజన్య కళా స్రవంతి దర్శకుడు కేఎల్ఎన్.స్వామి ఆధ్వర్యంలో దేవరాగం నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, పన్నాల నరసింహమూర్తి, చిగిలిపల్లి డిల్లీశ్వరరావు, మానాపురం సత్యనారాయణ, ప్రతాప్ కుమార్, కీర్తి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి

గుజరాతీపేట, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి):నామినేటెడ్ పోస్టుల్లో బీజేపీ నాయకులకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆ పార్టీ జిల్లాఅధ్యక్షుడు చేపట్టిన సిరిపురం తేజేశ్వరరావు కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తేజేశ్వరరావు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ను మంగళవారం కలుసుకున్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం

●శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్


కుమ్మరిపేటలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న గొండు శంకర్

గార ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం గార, ఆరంగిపేట కరణాలపేట, కుమ్మరిపేట తదితర గ్రామాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సీసీ రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆరంగిపేట నుంచి కొర్ని వరకు బీటీ రోడ్డుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పల్లె వెలుగు బస్సుల ద్వారా ప్రజలకు రవాణా సౌకర్యాలను అందుబాటులో తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పీసా వెంకటరమణమూర్తి గార మాజీ సర్పంచ్ బడగల వెంకట అప్పారావు,గార పీహెచ్సీ అభివృద్ధి కమిటీమాజీ చైర్మన్ కొంక్యాణ రమణమూర్తి, సర్పంచ్ కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర మీట్లో సత్తాచాటిన పీఈటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):జిల్లాకు చెందిన పీఈటీలు కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయుల స్పోర్ట్ అండ్ సెమినార్లో ఆల్రౌండ్ సత్తాచాటి 16 పతకాలు కైవసం చేసుకున్నారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన మీట్కు 67 మంది పీఈటీలు పాల్గొనగా, హ్యాండ్బాల్లో, షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్లో మొదటిస్థానాలు, పురుషుల 40 ప్లస్ విభాగంలో డబుల్స్, సింగిల్స్లో రజిత, 50 ప్లస్ పురుషులు విభాగంలో డబుల్స్, సింగిల్స్లో రజితపతకాలు సాధించారు. అథ్లెటిక్స్ విభాగంలో డి.యశోధ 400 మీటర్ల పరుగు,లాంగ్జంప్లో బంగారు పతకాలు, ఎం.జ్యోతి 400 మీటర్ల పరుగు, లాంగ్జంప్లో రజితపతకాలు సాధించారు. ఈమేరకు సత్తాచా టిన క్రీడాకారులకు డీఈవో ఎస్.తిరుమల చైతన్య అభినందిం చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి, జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షులు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్జీఎఫ్ కార్యదర్శి బీవీరమణ, ఎం.తిరుపతి, కె.మాధవరావు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీల్లో ..

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి కొయ్యి మదన్ గ్రిగ్స్పోటీల షాట్పుట్ విభాగంలో సత్తాచాటాడు. శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి గ్రిగ్స్ పోటీల్లో మదన్ ప్రథమ స్థానంలోనిలిచాడు.ఈమేరకు హెచ్ఎం ఎన్.విశ్వనాథం, ఉపాధ్యాయులు కామరాజు, గణేష్ అభినందించారు.

నిద్దాంలో నిద్దాలమ్మ యాత్ర

జి.సిగడాం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి):నిద్దాంలో నిద్దాలమ్మ యాత్ర మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. మహిళలు ముర్రాటలతో మొక్కులు చెల్లించుకున్నారు.ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


నిద్దాలమ్మకు ముర్రాటలు తీసుకువెళ్తున్న మహిళలు

75 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

గుజరాతీపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచే జరిగే ఇంటర్ పరీక్షల కోసం 75 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియల్ బోర్డు ప్రాంతీయ అధికారి (ఆర్ఐవో) ప్రగడ దుర్గారావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ పరీక్షలకు 40,346 మంది విద్యార్థులు హాజరవుతారని, జంబ్లింగ్ పద్ధతిలో, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 10 నుంచి ప్రారంభమయ్యాయన్నారు. ఈ పరీక్షలకు 113 కేంద్రాలు కేటాయించగా, తొలివిడతగా 61 కేంద్రాల్లో జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వినూత్న రీతిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు లేకుండా చేయాలని ఆలోచన చేసిందని, అయితే, ప్రజాభిప్రాయం మేరకు ఆ ప్రతిపాదనను విరమించిందన్నారు. పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయని, ఇందులో ఎటువంటి అనుమానం లేదన్నారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి పరీక్ష కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షణలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరపడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కన్నులపండువగా నగర సంకీర్తన

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సృష్టి అవతరించడానికి మూలకారకుడు శ్రీకృష్ణుడే అని యూరప్ ఖండానికి చెందిన అంతర్జాతీయ ప్రవచకులు దీరనంత గోస్వామి మహరాజ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సురంగి రాజా మైదానంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నగరసంకీర్తన కార్యక్రమాన్ని కనుల పండువగా జరిపారు. వివిధ దేశాల నుంచి వచ్చిన ఇస్కాన్ ప్రతినిధులు సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మునిసిపల్ చైర్పర్సన్ రాజలక్ష్మి, జనసేనఇన్చార్జి దాసరిరాజు పాల్గొన్నారు.


ప్రవచనాలు వినిపిస్తున్న దీరనంత గోస్వామి

ఆ గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందే..

- స్కూల్ ఆవరణలో నుంచే రాకపోకలు
- నిత్యం ఇక్కట్లకు గురవుతున్న విద్యార్థులు, ప్రజలు

పాతపట్నం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆ గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే పాఠశాల మధ్య నుంచే మార్గం.. వారికి ప్రస్తుతానికి మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో దీనినే రాక పోకలకు ఉపయోగిస్తున్నారు. దీంతో విద్యార్థులతో పాటు గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలిలా ఉన్నాయి.. బైదలాపురం మొదలుకొని ఈ మార్గం గుండా మామిడిపల్లి, గుడులిమిసింగి, కుంబంగూడ, లక్ష్మిగూడ, బెన్నుగూడ, కెరడా సింగి తదితర గూడల ప్రజలు రాకపోకలకు సరైన మార్గం లేక ఇక్కట్లకు గురవు తున్నారు. బైదలాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల భవనాల మధ్య నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం ఆయా గ్రామాలకు వాహ నాలు ఈ మార్గం గుండానే అధికంగా వస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచు కొస్తుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత టీడీపీ హయాంలో ఈ సమస్యను సీతంపేట ఐటీడీఏ అధికారుల దృష్టికి అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకువెళ్లారు. అప్పటి పీవో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పాఠశాల ప్రహరీని అనుకుని బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు వేశారు. దీనికి సంబం ధించి స్థలాలను ఇచ్చేందుకు రైతులు అంగీకరించేరు. అయితే వీరికి పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఇంతలో ఎన్నికలు వచ్చి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఐటీడీఏ కూడా పార్వతీపురం మన్యం జిల్లాలోకి వెళ్లిపోవడంతో సమస్య పరిష్కారానికి నేటికీ అడుగులు పడలేదు. దీంతో నిత్యం ఇటు విద్యార్థులు, అటు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.


ఈ ఆశ్రమ పాఠశాల మధ్య నుంచే ఆ గ్రామాలకు రోడ్డు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మాజీ సర్పంచ్ డొల్లు శ్రీనివాసరావుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో కె.తిరుమలరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా స్కూల్ కమిటీ అభ్యర్థన మేరకు సమస్యను ఉన్న తాధికారుల దృష్టికి తీసు కువెళతున్నామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి

పలాస, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద మంగళవారం ఉదయం 45 ఏళ్ల వయసు కలిగిన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన ఎడమచేతిపై మహేష్ అనే పేరు ఉందని, అతని వద్ద ఉన్న బ్యాగులో దుస్తులు తప్ప ఎటువంటి ఆనవాళ్లు లభించలేదని రైల్వే ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. విశాఖపట్నం నుంచి పలాస వచ్చే రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడడంతో అతని శరీరం రెండు ముక్కలైందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డీజీపురంలో ఉపాధ్యాయిని..


సుస్మిత పాత్రో (ఫైల్)

కంచిలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీజీపురంలో ఉపాధ్యాయిని కుమారి సుస్మిత పాత్రో (44) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. కెబి నౌగాం పాఠశాలలో కుమారి సుస్మితపాత్రో, భర్త దేవేంద్రబ్రహ్మ ఒడిశాలోని పరియాసాయిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా సుమన్ బ్రహ్మ విశాఖపట్నంలో ఇంటర్, మరో కుమారుడు సూరజ్‌బ్రహ్మ స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. కాగా భార్యాభర్తల మధ్య మనస్పర్థల వల్ల క్షణికావేశానికి లోనై సుస్మిత సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఇంట్లోని బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరిపోసుకొంది. విధులు నిర్వహించుకొని భర్త దేవేంద్ర బ్రహ్మ ఇంటికి వచ్చారు. ఇంటి లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. ఆ సమయంలో భార్యను పిలుస్తూ ఇంటి చుట్టూ తిరిగారు. ఆమె స్పందించకపోవడంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూసేసరికి ఆత్మహత్యకు పాల్పడి ఉండడంతో దేవేంద్ర బ్రహ్మ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు. సుస్మిత పాత్రో మృతదేహాన్ని మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరాస్వామి మృతి


వీరాస్వామి (ఫైల్)

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అమలపాడు గ్రామానికి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు దున్న వీరాస్వామి (65) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన కాంగ్రెస్ పార్టీ తరఫున రెండు పర్యాయాలు జడ్పీటీసీగా వ్యవహరించారు. అంతకుముందు అమలపాడు సర్పంచ్‌గా పనిచేశారు. వీరాస్వామి భార్య ఆరుద్రమ్మ కూడా సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యురాలిగా వ్యవహరించారు. రాజకీయాలకు అతీతంగా అందరితో సన్నిహితంగా, సరదగా ఉండే వీరాస్వామి మృతి చెందడం కలిచివేస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా వీరాస్వామి మృతదేహం వద్ద మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సంతాపం తెలిపి పాడె మోసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

బాహాడపల్లి మాజీ సర్పంచ్ సోమేశ్వరరావు..


సోమేశ్వరరావు(ఫైల్)

హరిపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బాహాడపల్లి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు సార సోమేశ్వరరావు మంగళవారం మృతి చెందారు. సర్దార్ గౌతు లచ్చన్న, మాజీ మంత్రి శివాజీ, ఎమ్మెల్యే శిరీష అనుచరుడిగా గుర్తింపు పొంది, 1995 నుంచి 2001 వరకు సర్పంచ్‌గా వ్యవహరిం చారు. ప్రజా సమస్యలు పరిష్కరించి అందరి వద్ద మంచిగా గుర్తింపు పొందారు. ఈయనకు భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సోమేశ్వ రరావు మృతికి ఎమ్మెల్యే శిరీష, టీడీపీ నాయకులు జీకే నాయుడు బావన దుర్యోధన, తాతారావు, లచ్చయ్య, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, భాస్కరరావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సంగీత విద్వాంసుడు భీమారావు..


భీమారావు(ఫైల్)

పోలాకి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పోలాకి గ్రామానికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు, హార్మోనిస్టు, విశ్రాంత ఉపాధ్యాయుడు మావుదూరు భీమారావు (90) మంగళవారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈయనకు ఇద్దరు కుమారులు, కుమార్తెలున్నారు. సంగీతంలో ఎందరినో శిష్యులను తయారు చేశారు. భీమారావు మృతి పట్ల టంకాల శ్రీరాములు, పల్లిరాజు భవానీ, సురేష్, గాయత్రీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సంతాపం వ్యక్తంచేశారు.

శిలాఫలకం ధ్వంసం కేసులో వ్యక్తి అరెస్టు

పోలాకి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రహిమాన్‌పురం బార్జిపాడు గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన కేసులో పురాణ శ్రీకాంత్‌ను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రంజిత్ కుమార్ మంగళవారం తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రంజిత్ పరిశీలించారు.

ఇంట్లోకి దూసుకొచ్చిన బైక్

- వ్యక్తిని ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి
- క్షతగాత్రుడు శ్రీకాకుళం వాసి

రాజాం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చావు ఏ రూపంలో వస్తుందో.. ఎలా వస్తుందో ఎవరికీ తెలియదనేందుకు మండల పరిధిలోని ఒమ్మి పంచాయతీ కొత్తపేటలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఘటనే నిదర్శనం. అప్పటివరకు ఇంటి గడపలో భార్యాభర్తలిద్దరూ కష్టసుఖాలు మాట్లాడుకున్నారు. ఇంతలో మంచినీరు తెస్తానని చెప్పి భార్య వీధిలోకి వెళ్లింది. భర్త ఒక్కరే స్టూల్‌పై కూర్చున్నారు. హఠాత్తుగా ఓ బైక్ ఇంట్లోకి దూసుకొచ్చి స్టూల్‌పై ఉన్న అతడిని బలంగా ఢీకొంది. ఏమైందో తెలుసుకునే లోగా పెద్ద కేకలు పెడుతూ నేలకూలాడు ఆ వ్యక్తి. బైక్‌తో ఢీకొన్న వ్యక్తి సైతం తీవ్ర గాయాలపాలై గడపలో పడిపోయాడు. అప్పుడే మంచినీటి కోసం బయటకు వెళ్లిన భార్య ఇంటి వద్ద జనం గుమిగూడి ఉండడం చూసింది. విషయం తెలుసుకుని గుండెలు బాదుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో భార్యాభర్తలు సీత, మాధవరావు కష్టసుఖాలు మాట్లాడుకుంటున్నారు. మంచి నీరు తెచ్చేందుకు సీత వీధిలోకి వెళ్లడంతో ఒక్కడే కూర్చుని మాధవరావు ఏదో ఆలోచిస్తున్నా డగా ఇంతలో రాజాం వైపు నుంచి బొబ్బిలి వైపు ద్విచక్ర వాహనంపై మితి మీరిన వేగంతో వెళ్తున్న వ్యక్తి నేరుగా మాధవరావు ఇంటి గడపలోకి బైక్‌తో దూసుకొచ్చి ఢీకొంది. దాంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌తో ఢీకొన్న వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. రాజాం సామాజిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. గాయపడిన వ్యక్తిది శ్రీకాకుళం కాగా.. రెవెన్యూశాఖలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడి భార్య సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు

హరిపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో మాదకద్రవ్యాలైన గంజాయి, డ్రగ్స్, సారా వంటి ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ హెచ్చరించారు. మందసలోని పలు దుకాణాలను మంగళవారం జాగిలాలతో తనిఖీ చేపట్టారు. ఆయనతో పాటు ఏఎస్‌ఐ శేఖర్, డిల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'మీకోసం' వినతులను తక్షణం పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హరిపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'మీకోసం' కార్యక్రమంలో వస్తున్న వినతులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కుంటికోట వైటీసీ భవనంలో మంగళవారం పలాస డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అర్జీలపై సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేలా అధికారులు దృష్టి సారించాలని కోరారు. మ్యుటేషన్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రైతులకు ఇబ్బంది పెట్టే చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. వివిధ విభాగాలకు చెందిన పలు అంశాల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పలాస ఆర్డీవో వెంకటేష్, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇందిరాగాంధీ విగ్రహ ఏర్పాటుకు సహకరించండి


కమిషనర్ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న డీసీసీ నాయకులు

పలాస, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా జంక్షన్ వద్ద ఉన్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని రోడ్డు వెడల్పులో భాగంగా 2021లో తొలగించారని, దానిని తిరిగి ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోందని, దీనికోసం సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. గత ఏడాది డిసెంబరులో మున్సిపల్ అధికారులను కలిసి సమస్యను విన్నవించామని, అయితే ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రోడ్డు మధ్యలో స్థలాన్ని చూపించారన్నారు. ఫిబ్రవరి 5న ఆ స్థలంలో విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసు కుంటున్న సమయంలో పార్టీ నాయకుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావుపై మున్సిపల్ కమిషనర్ ఫిర్యా దు చేశారన్నారు. అయితే దీనిపై కమిషనర్‌తో మాట్లాడగా తాను వ్యక్తి గతంగా ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదని సమాధానం ఇచ్చారన్నారు. ఇప్పటికైనా విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ కమిషనర్ ఎన్.రామా రావుకు మంగళవారం వినతిపత్రం అందిం చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి కిరణ్ కుమార్, టి.మధుసూ. దనరావు, యు. రాజారావు, ఎం.బాబూరావు, కె.హేమారావు చౌదరి తదితరులున్నారు. ఇదిలా ఉండగా జీవితేశ్వరరావు స్వగృహంలో మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అహ్మద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

విశాఖపట్నం డివిజన్‌కు ఉద్యోగులను కేటాయించాలి

- ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం


పలాసరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌కోస్టు రైల్వే ఖుర్దా డివిజన్‌లో ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు పనిచేస్తున్న తామంతా వివిధ సమస్యలతో ఇబ్బందులు పడు తున్నామని, అందువల్ల తమను విశాఖపట్నం డివిజన్‌కు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని రైల్వే ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. విశాఖ డివిజన్ ఏర్పడిన తరువాత తెలుగు ఉద్యోగులు అధిక సంఖ్య లో బదిలీపై ఖుర్దా డివిజన్ నుంచి వెళ్లిపోయారని, సాంస్కృతిక, భాషా వ్యత్యాసాలు, వైద్య సదు పాయాల్లోను తాము ఖుర్దా డివిజన్‌లో ఇబ్బం దులకు గురవుతున్నామన్నారు. ఒడిశాలోని ఆసుపత్రులకు వెళ్లేటప్పుడు భాషా ఇబ్బందులు, ఒడిశాలో సుదూర ప్రాంతంలో పని చేసేట ప్పుడు విద్యావ్యవస్థ వల్ల కుటుంబ సభ్యులు, పిల్లలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ఇచ్ఛాపురం నుంచి పలాస వరకూ ఖుర్దా డివిజన్‌లో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక ఉద్యోగుల సంక్షేమంపై ప్రభావం పడుతోందన్నారు. సమస్యలను పరిశీలించి న్యాయం చేయాలన్నారు.


ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందిస్తున్న రైల్వే ఉద్యోగులు

స్వమిత్వ సర్వే వేగవంతం చేయండి

పలాసరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్వమిత్వ సర్వేని వేగవంతం చేయాలని పలాస ఇన్‌చార్జి డివిజనల్ పంచాయతీ అధికారి గోపిబాల ఆదేశించారు. పలాస మండలం గంగువాడ, సరియాపల్లి గ్రామాల్లో మంగళ వారం సర్వే తీరును పరిశీలించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. ఈ సర్వే గత ప్రభుత్వం నుంచి చేపట్టామని, అయితే మధ్యలో ఎన్ని కల నిర్వహణతో నిలిచిపోయిందన్నారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ఇంటిపన్ను ఆధారంగా ఇంటి హద్దులతో కలిగిన బుక్‌లెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సర్వేలో వెనకబడిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పర్యటించి సచివాలయ ఉద్యోగులతో సర్వే వేగవంతం అయ్యేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శులు లండ శ్రీధర్, ఆశ తదితరులు పాల్గొన్నారు.

నిధుల వ్యయంపై విజిలెన్స్ ఆరా


రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి

నందిగాం,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): నందిగాం పంచాయతీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధుల వ్యయంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు ఆదేశాల మేరకు మంగళవారం సీఐ సతీష్ నేతృత్వంలో నందిగాం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి సుమారు రూ.30 లక్షలతో చేపట్టిన సీసీరోడ్లు, కాలువలు, చెరువు మెట్లు, గ్రామీణ రహదారి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఈ శివకుమార్, ఆడిటర్ ఎర్రన్నాయుడు, స్థానిక కార్యదర్శి గోపీనాథ్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటారు

జేఈఈ మెయిన్స్‌లో జిల్లాకు చెందిన పలు వురు విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో మంచి పర్సంటైల్ పొంది ఔరా అని పించారు. ఆ వివరాలిలా ఉన్నాయి..

దేవాదికి చెందిన రుత్విక్ సాయి



నరసన్నపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నరస న్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్‌సాయి జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటాడు. ఓబీసీ విభాగంలో 99.85 పర్సంటైల్ సాధించాడు. తండ్రి ధర్మాన శంకరనారాయణ చెన్నాపురం, తల్లి కొండాల లత నరసన్నపేట బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు. రుత్విక్ ఒకటో తరగతి నుంచి 6 వరకు ప్రైవేటు పాఠశాలలో చదివాడు. 7వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విజయవాడలోని ప్రైవేటు విద్యాసంస్థ లో చదివాడు. జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో 99.85 శాతం పర్సంటైల్ సాధించిన రుత్విక్ సాయిని గ్రామస్థులు అభినందించారు.

బిన్నల మదనాపురానికి చెందిన అక్షర..



హరిపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మంద స మండలం బిన్నల మదనాపురం గ్రామానికి చెందిన మార్పు అక్షర జేఈఈ మెయిన్స్‌లో ఓబీసీ విభాగంలో 99.65 పర్సంటైల్‌తో సత్తాచాటింది. ఈమె తండ్రి మార్పు వెంకటరమణ పాతపట్నంలో ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి నాగవేణి గృహిణి. కుమార్తె మంచి పర్సంటైల్ సాధించడంపై వారు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఐఐటీలో సీటే లక్ష్యంగా ముందు కెళ్తున్నట్లు ఆమె తెలిపింది.

సోంపేటకు చెందిన మోక్షలలిత..




సోంపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సోంపేట పట్టణానికి చెందిన సానా మోక్షలలిత మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తాచాటింది.ఈ మేరకు ఈబీసీ కేటగిరిలో 99 పర్సంటైల్ సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మోక్షలలిత రాజమండ్రిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది.

గిరిజన చట్టాలు సవరిస్తే ఉద్యమం తప్పదు


వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నేతలు

హరిపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల భద్రతా చట్టం 1/70ని సవరించాలనే ప్రభుత్వ ఆలోచనను తక్షణం విరమించుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నేతలు సవర ధర్మారావు, గిరినాథ్, ఫల్గుణరావు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మన్యం బంద్ నిర్వహిస్తున్నామన్నారు గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, శతశాతం ఉద్యోగాలను గిరిజనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సవర బావన్న, భీమారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని పరిరక్షించాలి



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘ నేతలు

కొత్తూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన ప్రాంత భూ హక్కు 1/70 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాలని ఆదివాసీ గిరిజనులు డిమాండ్ చేశారు. గిరిజనులను చులకనగా మాట్లాడిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం గిరిజన ప్రాంత అభి వృద్ధికి తోడ్పడడం లేదని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం శోచనీయ మన్నారు. కార్యక్రమంలో గిరిజనులు గేదెల ధర్మారావు, పాలక శ్రీను, సూర్యం, సంతోష్, సావిత్రమ్మ, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన

టెక్కలి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సంబంధించిన సదరం ధ్రువపత్రాలను స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో మంగళవారం పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ విభాగాలకు చెందిన దివ్యాంగులు ధ్రువపత్రాలతో రీవెరిఫి కేషన్‌కు హాజరయ్యారు. హాజరైన వారికి వైద్యులు మరోసారి పరీక్షించారు. అయితే ఆసుపత్రికి వచ్చే దివ్యాంగులకు కూర్చునేందుకు సరిపడా కుర్చీలు లేక కిందే కూర్చుని అవస్థలు పడ్డారు. అవసరమైన కుర్చీలను ఆసుపత్రి అధికారులు ఏర్పాటు చేయక పోవడంపై విమర్శలు వినిపించాయి.


కింద కూర్చున్న దివ్యాంగులు

న్యూస్ బాక్స్

హాస్టల్ పరిశుభ్రత ఇదేనా..?


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

టెక్కలి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.. పందులు తిరుగుతున్నాయి.. పర్యవేక్షణ ఇలాగేనా అని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సంక్షేమాధికారి రామకృష్ణను ప్రశ్నించారు. మంగళవారం అయ్యప్ప నగర్‌లోని బీసీ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ లో పరిశుభ్రత పక్కాగా పాటించాలన్నారు. మరోసారి వచ్చేసరికి మార్పు కనిపించాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈవో జగన్నాథం ఉన్నారు.

ఘనంగా మందిర వార్షికోత్సవం

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హనుమంతపురంలో షిర్డీసాయి మందిర ఆరో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో సామూహిక సత్యవ్రతాలు చేపట్టారు కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడు కణితూరులో..

నందిగాం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కణితూరులోని కొత్తమ్మతల్లి ఆలయ 22వ వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విఘ్నేశ్వరపూజ, రక్షాబంధనం, పంచామృతాభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, లలితా హోమం, అన్న ప్రసాద వితరణ చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

పాతపట్నం ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీ నీలమణి దుర్గ ఆలయంలోని దర్మహుండీల ఆదాయాన్ని బుధవారం దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కించనున్నట్లు ఆలయ ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. లెక్కింపులో ఆసక్తి ఉన్న భక్తులు ఉదయం 10 గంట లకు డ్రెస్ కోడ్ పాటించి పాల్గొనవచ్చని తెలిపారు.

19 లీటర్ల సారా స్వాధీనం

సోంపేట, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిడిపుట్టుగ కొత్తూరు, గొల్లవూరు వద్ద మంగళవారం బారువ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 19 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు బారువ ఎస్‌ఐ ఎస్.హరిబాబునాయుడు తెలిపారు. జీడిపుట్టుగ గ్రామానికి చెందిన చెల్లూరి లోకనాథం వద్ద 15లీటర్లు, గొల్లూరు గ్రామానికి చెందిన సూరి రామారావు నుంచి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

డిగ్రీ కళాశాలకు బెంచీల వితరణ

టెక్కలి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విశ్రాంత ఉపాధ్యా యులు సదాశివుని జగదీశ్వరరావు, ఉప్పాడ భాస్కరరావు కళాశాలలో ఆరుబయట కూర్చునేందుకుగాను ఆరు సిమెంట్ బెంచీలను మంగళవారం అందజేశారు. ప్రిన్సిపాల్ డా. గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డా.సతీష్, ల్యాబ్‌పాల్, సత్యసాయి ట్రస్ట్ కన్వీనర్ నర్సిం హారావు, చంటి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే రాయితీలు

జలుమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డు అందిస్తుందని, దీనిని పొందిరవారికే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు. చల్లవానిపేట, రాణ రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎంకిసాన్, అన్నదాత సుఖీభవ, పంటలబీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, పెట్టుబడి రాయితీ, యంత్ర పరికరాల రాయితీపై పొందేందుకు ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరన్నారు. రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి అందించాలన్నారు.